# తెర

అనెస్తీషియా మత్తులోంచి బయటపడి అప్పుడే కళ్లు తెరిచిన రమణయ్యకు అంతా అయోమయంగా ఉంది. మూసుకుపోతున్న కళ్లను తన శక్తినంతా కూడదీసుకుని తెరుస్తూ తన చుట్టూ వున్న పరిస్థితిని అర్థం చేసుకోవటానికి ప్రయత్నించాడు.

తనెక్కడున్నాడు? తనకిరువైపులా చేరి, తనకేసి గొప్ప సానుభూతితో ఆందోళనతో చూస్తున్నవాళ్ళంతా ఎవరు?

సూదులతో పొడుస్తున్నట్లుగా శరీరమంతా బాధ. కడుపుచుట్టూ ఏవో కట్లు. ఆ కట్లు కట్టినచోట కారం చల్లుతున్నట్లుగా విపరీతమైన మంట. కదిలితే ప్రాణం పోతుందేమో అన్నంత నొప్పి.

తెల్లటి దుస్తులతో నర్సులు అటూ ఇటూ తిరుగుతున్నారు.

అప్పుడర్థమైందతనికి. తను హాస్పిటల్ల ఉన్నాడు. తనకు ఆపరేషన్ చేశారు.

ఆపరేషన్ థియేటర్లోకి తనను తీసుకెళ్ళటం, డాక్టర్ తనతో ఏదో మాట్లాడుతున్నట్లుగా మాట్లాడుతూనే ఇంజెక్షన్ ఇవ్వటం, ముక్కుదగ్గర ఏదో పెట్టడం, తను స్పృహ కోల్పోవటం, ఒక్కొక్కటే జ్ఞాపకం రాసాగాయి.

తనకేసి ఆందోళనతో చూస్తున్న వాళ్ళందరినీ చూశాడు. వెంటనే వాళ్ళను గుర్తుపట్టలేకపోతున్నాడు. మెల్లమెల్లగా ఒక్కొక్కర్నీ గుర్తుపట్టసాగాడు.

తన కూతురు, తన ప్రాణంలో ప్రాణం సుమతి. ఆమె కళ్ళలోంచి ధారాపాతంగా కురుస్తున్న కన్నీళ్ళు. తన ఇద్దరు కొడుకులు సురేష్, సుధీర్, వాళ్ళ కళ్ళలో ఆందోళన, అల్లుడు మాధవరావు, కోడళ్ళు జ్యోతి, రాధ, చెల్లెలు సరస్వతి, బావ సత్యనారాయణ, పసిపిల్లలు సందీప్, సంతోష్, చైతన్య, వాళ్ళు తన మనుమలు, మనుమరాలు. అందరూ ఎంతో ఆదుర్దాతో, అభిమానంతో, ఆతురతతో తనకేసి చూస్తున్నారు.

అంత బాధలో కూడా అతను హాయిగా ఫీలయ్యాడు. తనచుట్టూ తన వాళ్లంతా ఉన్నారు. అవసరమైతే తన ప్రాణం కోసం తమ ప్రాణాల్ని అడ్డువేస్తారు. తనకోసం ఎంతటి మహత్తరమైన త్యాగానికైనా సిద్ధపడతారు.

ఇంతమంది ప్రేమాభిమానాలకు పాత్రుడైన తను నిజంగా అదృష్టవంతుడు.

రమణయ్యకు స్పృహ వచ్చిందని తెలియగానే అక్కడికి డాక్టర్ భాస్కరరావు వచ్చాడు. రమణయ్య బెడ్ చుట్టూ వున్న అతని బంధువులందరూ పక్కకు జరిగారు.

"ఏం రమణా! ఎలా వుంది?" అన్నాడు డాక్టర్ అతని చేయి పట్టుకొని

డాక్టర్ భాస్కరరావు రమణయ్యకు చిరకాలమిత్రుడు.

"అంతా మీదే భారం" బలహీనంగా అన్నాడు రమణయ్య చేతులు జోడించడానికి ప్రయత్నిస్తూ...

"అంతా ఆ పైవాడి భారం అనాలి. మానవమాత్రులం, మన చేతుల్లో ఏముంది చెప్పు? అదృష్టవశాత్తూ ఆపరేషన్ సక్సెసయింది. ఏ కాంప్లికేషన్స్ రాలేదు. నీకడుపులో పెరిగిన కంతిని తీసివేశాం. యూ విల్‌బి ఆల్‌రైట్...ధైర్యంగా వుండాలి" అన్నాడు డాక్టర్.

"నొప్పి, బాధ భరించలేకపోతున్నాను. ఈ బాధకంటే చచ్చిపోతే బావుండుననిపిస్తోంది" అన్నాడు రమణయ్య తగ్గు స్వరంతో...

డాక్టర్ భాస్కరరావు నవ్వాడు.

"నీ శరీరంలోంచి ఒక భాగాన్ని కట్ చేసి తీసేశాం కాబట్టి ఈ రోజు నొప్పి బాగానే ఉంటుంది. కొంచెం ఓర్చుకోవాలి" అన్నాడు.

అలాగేనన్నట్లు తలవూపాడు రమణయ్య.

కళ్ళనీళ్ళతో అక్కడ నిలుచున్న సుమతిని, ఇతరుల్ని చూడగానే "బెడ్ చుట్టూ ఇంతమందెందుకు చేరారు? సురేష్! ఎవరో ఒకర్ని మాత్రం ఉండమని, మిగతా వాళ్ళందర్నీ వెంటనే ఇక్కడ్నుంచి వెళ్ళిపొమ్మని చెప్పు" అన్నాడు డాక్టర్.

"సుమతీ! నువ్వొక్కదానివీ ఉండి మిగతావాళ్ళను వెళ్ళిపొమ్మని చెప్పు" అన్నాడు సురేష్. అందరూ అయిష్టంగా అక్కణ్ణుంచి బయటకు నడిచారు.

"రాత్రి నిద్రపట్టడానికి నర్స్ మాత్రలిస్తుంది. దాహంగా ఉంటే కొంచెం కొంచెం నీళ్ళు తాగించండి. రేపటికల్లా నువ్వు మామూలైపోతావు" అంటూ డాక్టర్ భాస్కర్‌రావు అక్కణ్ణించి లేచాడు.

బయటకు వెళ్ళిపోతున్న డాక్టర్‌ను సురేష్ అనుసరించాడు.

డాక్టర్ తన రూమ్‌లోకెళ్ళి కూర్చుంటూ సురేష్‌ను కూడా కూర్చోమన్నాడు.

"ఇట్స్ ఎ క్లియర్ కేసాఫ్ మాలిగ్నెన్సీ. మనం ఎర్లీగా డిటెక్ట్ చెయ్యటం మంచిదైంది. అయితే ఇప్పుడు కూడా పూర్తిగా అవుటాఫ్ డేంజర్ అనటానికి వీల్లేదు. మళ్ళీ రిపీట్ కాకపోతే కొంతకాలం బతకొచ్చు" అన్నాడు భాస్కరరావు.

"మళ్ళీ రిపీటవుతుందంటారా?" ఆందోళన ధ్వనించింది సురేష్ కంఠంలో...

"రిపీటవుతుందనే నా అనుమానం. కానీ ఖచ్చితంగా ఎప్పుడవుతుందో చెప్పలేం. మూడు నెలల్లో కావచ్చు."

"రిపీటయితే ఏం చెయ్యాలి?"

"మరోసారి ఆపరేషన్ చెయ్యాల్సి వుంటుంది. చూద్దాం... మూడు నెలలు అబ్జర్వేషన్లో ఉంచుదాం. కాని, అతనికి కేన్సర్ అని తెలియనీయకండి. అతని మనస్తత్వం నాకు తెలుసు. డిప్రెస్ అయిపోతాడు. అలా డిప్రెస్ అయిపోతే అయిదారు నెలలు బతకాల్సినవాడు అయిదారు వారాల్లోనే పోతాడు. సో బి కేర్‌ఫుల్" అన్నాడు డాక్టర్.

"అలాగే డాక్టర్!" అంటూ సురేష్ లేచి డాక్టర్‌కు నమస్కారం చేసి రూమ్‌లోంచి వార్డ్‌లోకొచ్చాడు.

వారం రోజుల తరువాత రమణయ్య ఆరోగ్య పరిస్థితి క్రమంగా మెరుగవుతుండటంతో బంధువలంతా వాళ్ల వాళ్ళ ఊళ్ళకు వెళ్లిపోవటానికి సిద్ధమయ్యారు.

వెళ్ళేముందు అందర్నీ తమ ఇంట్లోని హాల్లో సమావేశపరిచాడు సురేష్.

"నాన్నగారి ఆరోగ్యం గురించి మీ అందరికీ ఒక ముఖ్యమైన విషయం చెప్పాలి" అన్నాడు సురేష్.

అందరి గుండెలు వేగంగా కొట్టుకున్నాయి.

"నేను చెప్పబోయే విషయాన్ని అందరూ మనస్సుల్లోనే పెట్టుకోవాలి తప్ప ఎవరూ, ఎక్కడా ఆ విషయం చెప్పకూడదు!" మళ్ళీ అన్నాడు సురేష్.

"త్వరగా ఏమిటో చెప్పన్నయ్యా! నాకు భయమేస్తోంది" అంది సుమతి. అప్పటికే ఆమె కంఠం రుద్ధమైపోయింది.

"త్వరగా చెప్పు. నువ్వు చెప్పేలోగా దీని గుండె ఆగిపోతుందేమోనని భయపడి ఛస్తున్నాను" అన్నాడు మాధవరావు.

"నాన్నగారి జబ్బు విషయంలో నాకూ, డాక్టర్ భాస్కరరావుగారికి తప్ప మరెవ్వరికీ తెలియని

రహస్యమొకటుంది. మీరంతా ఆయనది మామూలు కడుపునొప్పి అనుకుంటున్నారు. నెలరోజుల క్రితమై ఆయనకు తీవ్రంగా కడుపునొప్పి వచ్చినప్పుడే అది కాన్సరేమోనని అనుమానించాడు డాక్టర్"

సురేష్ చెప్పడం పూర్తిచేయకుండానే అందరూ "కేన్సరా?!" అన్నారు.

"ఔను. ఆ రహస్యం ఎవరికీ చెప్పొద్దని డాక్టర్ గట్టిగా చెప్పడంవల్ల నేనెవరికీ చెప్పలేదు. పరీక్షలన్నీ చేసి రిపోర్ట్స్ చూశాక డాక్టర్ అనుమానం నిజమేనని తేలింది. ఆ తరువాత మొన్న ఆపరేషన్ చేశారు. నాన్నగారికి కేన్సర్ అని గుర్తించడం ఇంకో వారంరోజులాలస్యమైతే ఈ పాటికాయన కన్నుమూసేవాడు. నిజం చెప్పాలంటే డాక్టర్ భాస్కరరావే ఆయన్ను బతికించాడు"

సురేష్ పూర్తి చేసేలోపలే అక్కడున్న వాళ్ళంతా ఏడవటం మొదలెట్టారు.

కాస్సేపాగి సురేష్ మళ్ళీ చెప్పాడు.

"ఆపరేషన్ సక్సెస్‌ఫుల్‌గానే జరిగింది. కాన్సర్ ఎఫెక్టయిన పార్ట్‌ను తీసేశారు. అయినా ఆయన మూడు నెలలకంటే ఎక్కువకాలం బతక్కపోవచ్చు"

సురేష్ ఆ మాట అనగానే అందరూ ఒకేసారి "ఆ" అన్నారు. సుమతి దు:ఖాన్ని ఆపుకోలేక కుప్పకూలిపోయింది. మిగతావాళ్ళంతా ఆమె చుట్టూ చేరి ఏడవసాగారు.

"ఏడిస్తే లాభం లేదు సుమతీ! ధైర్యంగా వుండాలి. ఆయనకు కేన్సరనీ, మూడు నెలలకంటే ఎక్కువ బతకడనీ నాన్నగారికి తెలియకూడదు. ఎవరూ ఎప్పుడూ నోరు జారవద్దు" అన్నాడు సురేష్.

"మనమంటే ఊరుకుంటాంగానీ ఈ ఆడవాళ్ళ నోట్లో మాటాగుతుందా?" అన్నాడు మాధవరావు.

"ఇంకా కొంతకాలం హాయిగా ఆయన మన మధ్య ఉండాలని కోరుకుంటే మనం ఆయనకీ విషయం తెలియకుండా జాగ్రత్తపడాలి" అన్నాడు సురేష్.

వాళ్ళంతా ఒకరితో ఒకరు "నువ్వు చెప్పొద్దంటే","నువ్వు చెప్పొద్దు" అని చెప్పుకుని ఆ హాల్లోంచి రమణయ్యను చూడటానికి హాస్పిటల్‌కు వెళ్ళారు.

తండ్రిని చూడగానే సుమతి దు:ఖాన్నాపుకోలేకపోయింది. మాధవరావు హృదయంలో మామగారిమీద సానుభూతి పెల్లుబుకింది. సరస్వతి అన్నగారిమీద పడి ఏడుస్తుంటే సురేష్ ఆమెను వెనక్కిలాగాడు. జ్యోతి, రాధల కళ్ళుకూడా చెమ్మగిల్లాయి.

"మీరంతా ఎందుకేడుస్తున్నారు? అంతా అయిపోయిందిగా? ప్రమాదంలోంచి బయటపడ్డానుగా! ఇంకో వారం పదిరోజుల్లో పూర్తిగా నయమౌతుందనీ, హాస్పిటల్‌నుండి పంపించేస్తారనీ డాక్టర్ చెప్పాడు. మీరంతా ఇవ్వాళ వెళ్ళిపోతున్నామన్నారు. ఎందుకెళ్ళలేదు? అన్నాడు రమణయ్య.

"వెళ్తాంలెండి. వెళ్ళేముందు మిమ్మల్నొకసారి చూసి వెళ్దామని ఇలా వచ్చాం. మరేం లేదు." అన్నాడు మాధవరావు.

కళ్ళనిండా నీళ్ళు నిండిన సుమతిని ప్రేమగా చూస్తూ..."చిన్నప్పటినుంచి ఇదింతే! నాకేదొచ్చినా తట్టుకోలేదు. నాకు ముల్లు గుచ్చుకుంటే తనకు గుచ్చుకున్నట్లుగా బాధపడుతుంది. రేపు నిజంగా నాకేదన్నా అయితే ఇదెలా తట్టుకుంటుందో ఏమో" అన్నాడు రమణయ్య.

తండ్రికొచ్చిన రోగం తనకొచ్చి తండ్రి బాగుపడితే? అలా ఎవరన్నా చేయగలిగితే? తండ్రికోసం తన ప్రాణాలిమ్మని ఎవరన్నా అడిగి తండ్రి ప్రాణాల్ని నిలపగలిగితే? అనుకుంది సుమతి.

*　　　　*　　　　*

కేవలం స్వయం కృషితో ఏమీలేని స్థితినుంచి బాగా ఉన్నవాడి స్థితికొచ్చాడు రమణయ్య. చిన్నప్పుడే తల్లితండ్రుల్ని కోల్పోయాడు. ఒక దూరపు బంధువు సహాయంతో వరంగల్‌లోని ఒక రైస్‌మిల్‌లో వర్కర్‌గా చేరి, యజమాని నమ్మకాన్ని చూరగొని, ఆ మిల్లుకు మేనేజరయ్యాడు. అప్పట్నుంచీ రమణయ్య పట్టుకున్నదల్లా బంగారమైంది.

చెల్లెలు పెళ్ళి ఘనంగా చేశాడు. తానే స్వయంగా పెట్టుబడి పెట్టి వాళ్ళచేత ఓ కిరాణా అండ్ జనరల్ స్టోర్స్ పెట్టించాడు. ఆ రోజుల్లోనే ఓ పెద్ద వ్యాపారస్తుడి దృష్టి రమణయ్యమీద పడింది. పెద్ద కట్నంతో తన కూతుర్నిచ్చి పెళ్ళి చేశాడు.

రమణయ్యకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు కలిగారు. అందర్నీ ఎంతో ప్రేమగా పెంచుకున్నాడు. కొడుకులు పెద్దవాళ్ళు కాగానే మంచి సంబంధాలు చూసి పెళ్ళిళ్ళు చేసి వాళ్ళనుకూడా వ్యాపారంలో పెట్టాడు. కొడుకులిద్దరి పెళ్ళిళ్ళయ్యాక అతని భార్య అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించింది. భార్య చనిపోయాక రమణయ్యకు కూతురు సుమతే సర్వస్వమైపోయింది. ఆ అమ్మాయికి తల్లి, తండ్రి తానే అయి కంటికి రెప్పలా కాపాడుకుంటూ పెంచాడు. ఒక్క క్షణం కూడా ఆమెను వదిలిపెట్టి ఉండలేకపోయాడు.

సుమతికి మంచి సంబంధం చూసి పెళ్ళి చేశాడు. అల్లుడు మాధవరావు ఇంజనీర్. పెళ్ళయినప్పటికీ సుమతి ఎక్కువగా పుట్టింట్లోనే ఉంటుండేది.

బంధువులందరూ రమణయ్యనెంతో గౌరవించేవాళ్ళు. వాళ్ళందరికీ అతడే కేంద్రం. బంధువులమధ్య ఏ వివాదం తలెత్తినా రమణయ్యే పరిష్కరించాలి. ఎవరు కష్టాల్లో ఉన్నా రమణయ్యే ఆదుకోవాలి.

రమణయ్య ఇల్లెప్పుడూ వచ్చేపోయే బంధువులతో పెద్ద సందడిగా ఉండేది. విందులూ, వినోదాలు గొప్పగా జరిపేవాడు.

చెల్లెల్నీ, కూతుర్నీ, కోడళ్ళనూ అందర్నీ సమానంగా చూసుకునేవాడు. ఎవరికీ ఎలాంటి లోటు రానిచ్చేవాడు కాదు.

ఇప్పుడు రమణయ్యకు అరవయ్యేళ్ళు. కాని అలా కనిపించేవాడు కాదు. ఎప్పుడూ ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉంటూ నలభైకూడా నిండనివాడిలా కనిపించేవాడు.

..... ..... .....

రెండు నెలలు గడిచాయి. తండ్రిని అనుక్షణం చూసుకుంటూ సుమతి అతని దగ్గరే ఉండిపోయింది. సరస్వతి వారం రోజులకొకసార వచ్చి వెళ్ళసాగింది. అల్లుడు, బావ, వియ్యంకులు ఎప్పుడూ ఎవరో ఒకరు వచ్చిపోతుండేవాళ్ళు.

రమణయ్య ఇల్లొక సత్రంలా మారిపోయింది.

వచ్చేపోయే బంధువులందరికీ సపర్యలు చెయ్యలేక కోడళ్ళిద్దరికీ అలసట వచ్చేసింది.

వండింది వడ్డించలేక, రాత్రిళ్ళు పడకలు సర్దలేక, అసలు భర్తలతో ఏకాంతంగా మాట్లాడే అవకాశమే లేక, పిల్లలకు చదువులు చెప్పే తీరిక లేక వాళ్ళకు ఒక్కోసారి విపరీతమైన విసుగూ, కోపం కలుగుతుండేవి. అలాంటి సమయాల్లో "ఇంకో నెల రోజులైతే పోతాడులే పాపం! ఎలాగో ఓపిక పట్టాలి" అనుకుంటూ రోజులు లెక్కపెడుతుండేవాళ్ళు.

భార్యలేకుండా నెలలకొద్దీ గడపటం అంటే మాధవరావుకు పిచ్చెక్కినంత పనయింది.

ఒకరోజు కోపాన్నీ, బాధను ఆపుకోలేక భార్యతో పోట్లాడాడు.

"నువ్వొచ్చి ఇక్కడ నెలలకొద్దీ ఉంటే నేనేమయిపోవాలి? హోటలు తిండి తినలేక ఛస్తున్నాను. రాత్రిళ్ళు నిద్రపట్టక పిచ్చెక్కుతోంది" అన్నాడు.

"నాన్నగారికిలా ఉంటే నన్నెలా రమ్మంటారు? మహా అయితే ఆయనింకో నెల రోజులేగా మన మధ్యనుండేది?" అని కళ్ళనీళ్ళు పెట్టుకుంది సుమతి.

"నెలరోజుల్లో మాత్రం పోతాడని గ్యారెంటీ ఏముంది?" నాలుక చివరిదాకా వచ్చిన మాటను భార్య ముఖం చూసి దిగమింగాడు మాధవరావు.

సరస్వతి ఎప్పుడూ అన్నగారి దగ్గరుండిపోవడంతో సత్యనారాయణ పరిస్థితి కూడా ఇలాగే తయారయింది.

తన వాళ్ళందరూ ఎప్పుడూ తన దగ్గరే ఉండిపోవడం,అందరూ తనను పువ్వుల్లో పెట్టి పూజించడం, ఏది కావాలంటే అది క్షణాలమీద తెచ్చివ్వటం రమణయ్యకు ఎంతో హాయిగా ఉంది.

* * *

మరో నెలరోజులు గడిచాయి.

రమణయ్య ఆరోగ్యం ఇంకా మెరుగైంది. అతను మామూలుగా లేచి తిరగసాగాడు. తన రైస్‌మిల్లు దగ్గరకు వెళ్ళి పూర్వంలా తన పనులన్నీ చూసుకోసాగాడు. అందరితో హాయిగా కబుర్లు చెప్పసాగాడు. మనుమలు, మనుమరాళ్ళతో ఆడుకోసాగాడు. వ్యాపారాన్ని అభివృద్ధి చెయ్యటానికి కొత్త పథకాలు ఆలోచించసాగాడు.

* * *

"మూడు నెలలు గడిచాయి కదా! ఇక గండం గడిచినట్టేనా?" అడిగాడు సురేష్ డాక్టర్ భాస్కరరావు దగ్గరకు వెళ్ళి.

"గండం గడిచిందని చెప్పలేం. ఏ క్షణంలోనైనా మళ్ళీ అతని కడుపులోని కొన్ని భాగాలు ఎఫెక్టు కావచ్చు" అన్నాడు డాక్టర్.

"నాన్నగారు మూడో నెలలో పోతారని తెలిసి బంధువులంతా ఆయనను చూడటానికొస్తున్నారు. వీళ్ళకి చేసి పెట్టలేక మా భార్యల ప్రాణాలు పోతున్నాయి. అందరూ నాన్నమీద బోల్డు ప్రేమ ఒలకబోస్తున్నారు" దిగులుగా అన్నాడు సురేష్.

"అసలు మీరీ వార్తను అందరికీ ఎందుకు చెప్పారు? ఈపాటికి ఎవరో ఒకరు ఆయనకు చెప్పే వుంటారు" అన్నాడు డాక్టర్.

"దగ్గరవాళ్ళకైనా చెప్పకపోతే బావుండదని చెప్పాను. నాన్నగారికి ఎవరూ చెప్పలేదు" అన్నాడు సురేష్.

"మీ నాన్నగారు పూర్తిగా కోలుకున్నారనీ, ఏమీ ఫరవాలేదనీ చెప్పి అందర్నీ పంపించెయ్యండి" అన్నాడు డాక్టర్.

సురేష్ ఇంటికొచ్చి బంధువలందరికీ నాన్నగారు పూర్తిగా కోలుకున్నారని, ఆయనకేమీ ఫరవాలేదని డాక్టరు చెప్పాడని చెప్పేశాడు. దాంతో వాళ్ళింటికి బంధువులు రావటం తగ్గిపోయింది. సుమతి, సరస్వతి వాళ్ళ భర్తల పోరు భరించలేక వాళ్ళ ఊళ్లకు వెళ్లిపోయారు.

ఇంట్లో ప్రశాంతత ఏర్పడింది. జ్యోతి, రాధలు ఊపిరి తీసుకున్నారు.

రమణయ్యకు మాత్రం చాలా దిగులు కలిగింది. ఇంతకాలం తనను కంటికి రెప్పలా చూసుకున్న సుమతి వెళ్లిపోవడంతో అతను చాలా ఒంటరిగా ఫీలయ్యాడు. ఈ దిగులుతో వారం రోజుల్లోనే మంచం పట్టాడు.

ఈ వార్త తెలియగానే సుమతి క్షణాలమీద నాన్నగారిదగ్గరకొచ్చేసింది. మిగతా బంధులందరూ వచ్చేశారు.

"ఈ దెబ్బతో మామగారు ఫినిష్" అనుకున్నాడు మాధవరావు.

వాళ్ళందరినీ చూడగానే రమణయ్య మామూలుగా మారిపోయాడు.

* * *

మరో మూడు నెలలు గడిచాయి.

సుమతి ఆ మూడు నెలల్లోనూ వారం రోజులు తండ్రి దగ్గరుంటే ఓ రెండ్రోజులు భర్త దగ్గరుండేది.

"ఈ ముసలాడు బతకటమేమిటోగాని అది నా చావుకొచ్చింది" అనుకున్నాడు మాధవరావు. ఈ విషయంలో ఎన్నోసార్లు భార్యతో పోట్లాడాడు. రమణయ్యకు జబ్బు చేసినప్పటినుంచి సుమతి, మాధవరావుల ఇంట్లో శాంతి కరువైపోయింది.

మరో నెల రోజులు గడిచాక రమణయ్యకు మళ్ళీ కడుపులో నొప్పి వచ్చింది. డాక్టర్ భాస్కరరావు టెస్ట్ చేసి ఆపరేషన్ చెయ్యాలన్నాడు.

మళ్ళీ బంధువులందరూ వచ్చారు.

రమణయ్యను ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళుతుంటే అంతా భోరుమని ఏడ్చారు.

రెండోసారి ఆపరేషన్ చేశాక రమణయ్య పరిస్థితి పక్కమీదినుంచి లేవలేనిదిగా మారిపోయింది.

కేన్సర్ రమణయ్య మొత్తం పేగులకు వ్యాపించిందట. కడుపు తెరిచి చూస్తే పేగులలోపలి భాగమంతా కంతులతో పూడుకుపోయిందట. ఆపరేషన్ అసాధ్యమైపోయిందట. ఎలాగో తంటాలుపడి కడుపులో చాలా భాగాలు కట్ చేసి మళ్ళీ మూసేశారు.

ఈసారి డాక్టర్ భాస్కరరావు సురేష్‌ని పిలిచి "హిజ్ కండిషన్ ఈజ్ వెరీబాడ్! ఒక నెలరోజులకంటే ఎక్కువ బతక్కపోవచ్చు" అని చెప్పేశాడు.

తండ్రి ఏ క్షణానైనా ప్రాణాలు కోల్పోవచ్చునని సుమతి అనుక్షణం అతని పక్కనే ఉండిపోయింది. మిగతా బంధువులు కూడా ఒక రోజిక్కడ, ఒకరోజక్కడ అన్నట్టుగా వచ్చిపోసాగారు.

ఈ సారి సురేష్ తన భార్య జ్యోతితో చెప్పాడు...

"నాన్నగారు ఇంకో నెలరోజులకంటే ఎక్కువ రోజులు బతకడు. ఈ నెల రోజులు ఎలాగో మీ కోడళ్ళిద్దరూ కష్టపడండి" అని.

అందుకే బండెడు చాకిరీతో సతమతమైపోతున్నా ఇంకో నెలరోజులైతే మన కష్టాలు తీరుతాయిలే అనుకుంటూ తమను తాము ఓదార్చుకున్నారు.

పూర్తిగా పక్కకే అంటుకుపోయినప్పటికీ రమణయ్య మాత్రం ఉల్లాసంగానే ఉన్నాడు. తనను చూడడానికొచ్చిన వాళ్ళందరితోనూ వ్యాపారంగురించి, అంచెలంచెలుగా తను పైకొచ్చిన విధానం గురించి చాలా హుషారుగా మాట్లాడేవాడు. సుమతి కొడుకు సందీప్, సురేష్ కూతురు చైతన్యల పెళ్ళి ఘనంగా జరిపించేవరకూ తాను బతుకుతానని చెప్పేవాడు.

నవ్వుతూ, తుళ్ళుతూ కులాసాగా ఉంటున్న రమణయ్యను చూసి అందరూ "ఆరిపోయే ముందు దీపం వెలుగు" అనుకున్నారు.

రెండో ఆపరేషన్ కూడా జరిగి నెలరోజులు గడిచాయి.

రమణయ్య ఆరోగ్య పరిస్థితిలో మార్పులేదు. అంతకంతరూ మెరుగవుతున్నట్టుగా కనిపించాడు.

మాధవరావులో విపరీతమైన అసహనం ప్రవేశించింది. భార్యలేకుండా గడపటం అతనికి దుర్భరంగా మారింది. మరోదాన్ని ఎవరినన్నా చూసి రెండో పెళ్ళి చేసేసుకుందామా అన్న ఆలోచన కూడా వచ్చేసింది.

జ్యోతి, రాధలకు ఆ ఇంట్లోంచి ఎవరికీ చెప్పాపెట్టకుండా దూరంగా పారిపోదామనిపించిది.

సురేష్, సుధీర్‌లిద్దరూ "ఈయనింకా ఎంతకాలం బతుకుతాడు?" అని విసుగ్గా అనుకున్నారు.

తండ్రిని ఎంతో గాఢంగా ప్రేమించే సుమతిలో కూడా "నాన్నింకా చచ్చిపోదేమిటి?"

అన్న భావం కలిగింది. మొదట్లో "నాకింత పాడు ఆలోచన ఎందుకొచ్చింది?" అనుకుని దాన్ని కొట్టేసినా క్రమక్రమంగా ఆమెలో కూడా ఆమెకు తెలియకుండానే ఆ భావం పెరిగి పెద్దది కాసాగింది.

రమణయ్య పనులు చెయ్యటంలో అందరికీ అసహ్యం, విసుగూ కలగసాగాయి.

మాధవరావు ఒకరోజు అందరి ఎదుటా భార్యతో పోట్లాడాడు.

"ఇంకా ఎంతకాలం నన్నిలా చంపుతావు? వెంటనే ఇంటికొస్తావా? లేక నన్ను వేరే దారి చూసుకోమంటావా?" అని భార్యను నిలదీశాడు.

సుమతి మారు మాట్లాడకుండా అప్పటికప్పుడు ప్రయాణమై భర్తతో వెళ్ళిపోయింది.

సత్యనారాయణ సరస్వతిని తీసుకొని వెళ్ళిపోయాడు.

మిగతా బంధువులు కూడా రమణయ్యను చూడటానికి రావటం మానేశారు.

రమణయ్య పనులన్నీ కోడళ్ళిద్దరే చేయాల్సి రావటంతో వాళ్ళూ భర్తలతో పోట్లాడారు.

"అతని పనుల్ని మేం చెయ్యలేం...ఉమ్మి, మలమూత్రాలు ఎత్తడం మావల్లకాదు. ఎవరైనా పనిమనిషిని చూడండి" అన్నారు వాళ్ళు.

"ఆయనింకా ఎంతోకాలం బతకడు ఇంకో నాలుగు రోజులు ఓపికపట్టండి. పనిమనిషిని పెడితే ఆయన చాలా నొచ్చుకుంటాడు" అన్నాడు సురేష్.

"నాలుగురోజులు కాదు. నాలుగు నెలలైనా, నాలుగు సంవత్సరాలైనా ఆయనకేమీ కాదు. రాయిలా ఉంటాడు. పోయేవి మా ప్రాణాలే! ఎంత డబ్బయినా సరే పనిమనిషిని చూడండి. రేపట్నించి మేమసలు ఆయన గదిలోకికూడా వెళ్ళం" అంది జ్యోతి.

కాని, పక్క మీద పడిపోయిన రమణయ్యకు పనులన్నీ చేసిపెట్టే పనిమనిషెవరూ దొరకలేదు. అతను "ఇది కావాలి...అది కావాలి" అని పెట్టే కేకలకు కోడళ్ళిద్దరూ అతని గదిలోకెళ్ళడం మానేశారు. కాఫీ, భోజనం మొదలైనవాటిని అతనిగదికి పిల్లలతో పంపించడం... ఎప్పుడన్నా వెళ్ళినా అతన్ని చీదరించుకోవడం, విసుక్కోవడం కోపగించుకోవడం మొదలెట్టారు.

రమణయ్య కోడళ్ల ప్రవర్తనను గురించి కొడుకులకు ఫిర్యాదు చేశాడు. వాళ్ళు కూడా రాకపోవడంతో అతను పూర్తిగా కుంగిపోయాడు.

అందరూ అకస్మాత్తుగా ఇలా ఎందుకు మారిపోయారో అతనికర్థం కాలేదు.

తన వాళ్ళంతా తనసెంతో ప్రేమిస్తున్నారనీ, తనకోసం వాళ్లు తమ ప్రాణాలనైనా ఇస్తారని ఇంతకాలం అనుకున్నాడు. కాని ఇప్పుడు తనకు కనీసం మంచినీళ్ళు కూడా ఇచ్చేవాళ్లు లేరు. వేళకు మందులిచ్చేవాళ్ళు లేరు. కంపుకొడుతున్న తన గదిని శుభ్రం చేసేవాళ్ళు లేరు. మలమూత్రాలకు తీసుకువెళ్లేవాళ్ళు లేరు. తన పరిస్థితి తనకే జాలి కలిగించేలా మారిపోయింది.

రమణయ్య కళ్ళముందో తెర...విశాలంగా, తెల్లగా, తళతళ మెరుస్తూ కనిపించింది. ఆ తెరమీద తనున్నాడు. తనచుట్టూ తనవాళ్ళందరూ... సుమతి, సరస్వతి, సురేష్, సుధీర్, జ్యోతి, రాధ ఉన్నారు. వాళ్ళమధ్య తను హాయిగా, ఆనందంగా, మహారాజులా వెలిగిపోతున్నాడు.

అకస్మాత్తుగా ఆ తెర చిరిగిపోయింది. రెండుగా చీలిపోయి పక్కకు తప్పుకుంది. దాని వెనుక మరో తెర స్పష్టంగా కనిపించింది. ఈ తెరమీద విషాదం మూర్తీభవించిన తను, పక్కమీదనుంచి లేచే శక్తికూడా లేని తను, తెర అంచుల్లో దాక్కొని తనకేసి చూస్తూ వెకిలిగా నవ్వుతున్న సుమతి, సరస్వతి, సురేష్, సుధీర్, జ్యోతి, రాధ, మాధవరావు, సత్యనారాయణ.

వాళ్ళంతా తాను రెక్కలు ముక్కలు చేసుకుని సంపాదించిన ఆస్తిని అనుభవిస్తున్నవాళ్ళు. ఈనాడు తనకు గుక్కెడు మంచినీళ్ళివ్వటానిక్కూడా కరువైపోయినవాళ్ళు.

తను వాళ్ళకెంత చేశాడు? తన పిల్లలు. తన సుమతి, ఎందరు దూరమైనా సుమతి తనకు దూరం కాదనుకున్నాడు. ఆమెను తన ప్రాణంలో ప్రాణంగా పెంచి పోషించాడు. సురేష్ సుధీర్‌లు... తన రక్తాన్ని ధారపోసి వాళ్ళ జీవితాల్లో సుఖాల దీపాల్ని వెలిగించాడు.

తన బంధువులు, మిత్రులు అడిగినవాళ్ళకు లేదనుకుండా ఇచ్చాడు, కూలిపోతున్న ఎన్నో కుటుంబాలను నిలబెట్టాడు. వాళ్ళంతా తన రక్తాన్ని పీల్చుకున్నారు. తనిప్పుడు కక్కృంగి, క్రుశించిపోతోంటే వదిలేశారు.

రమణయ్యలో సహజంగా ఎప్పుడూ ఉండే బతుకుమీది ప్రీతి నశించడం మొదలెట్టింది. బయట ప్రపంచంమీద శ్రద్ధాసక్తులు తగ్గిపోయాయి. పూర్తిగా అంతర్ముఖుడైపోయాడు.

అక్కడ అతని అంతరంగ మథనం మీద ఒక తెర...ఒక జ్యోతి...సత్యాన్ని చూసే ఒక గొప్ప ప్రకాశం అతనికి ప్రత్యక్షమయ్యాయి.

ప్రపంచమంతా తనదేననుకున్నాడు. అందరూ తనవాళ్ళేననుకున్నాడు. అందరికీ తన అవసరం ఉందనుకున్నాడు. తను లేకపోతే వాళ్ళంతా ఒక్క క్షణం కూడా బతకలేరనుకున్నాడు. కానీ వాళ్ళంతా తన చావుకోసమే ఎదురుచూసే క్షణం వస్తుందని ఊహించనైనా లేదు. కాని, ఈ బంధాలెంత అశాశ్వతమైనవి! శాశ్వతమైనవేవి? దేవుడు, భక్తి, మోక్షం, పూజ, పునస్కారాలు...వీటిని గూర్చి తానెప్పుడూ పెద్దగా పట్టించుకోలేదు. ఎంతసేపూ కూతురు, కొడుకులు, చెల్లెలు, కోడళ్ళు, అల్లుడు,మనుమలు, మనుమరాళ్ళు...వీళ్ళను గూర్చే ఆలోచించాడు. కాని, ఇప్పుడు తనకెవరూ లేరు! అతని మనస్సునావరించిన ఆ అందమైన తెర ముక్కలు ముక్కలైపోయింది.

పదిరోజులు గడిచాయి.

ఒకరోజు తన గదిలో పగలు నిద్రపోతున్న రమణయ్యకు అకస్మాత్తుగా ఏదో పీడకల వచ్చి మెలకువ వచ్చింది. తన గది పక్కనే ఉన్న హాల్లోంచి కోడలు జ్యోతి ఎవరితోనో మాట్లాడుతున్న మాటలు అతనికి స్పష్టంగా వినిపించాయి.

“అసలు మీ మామగారికేం రోగం? పోతాడు పోతాడు అనుకోవటమేగానీ ఆయనకు మాత్రం నూరేళ్ళాయుష్షున్నట్లుంది. పాపం చెయ్యలేక మీరు ఛస్తున్నారు!” ఆ గొంతు పక్కింటి పార్వతమ్మది.

“అది కేన్సరట పిన్నీ! మొదట ఆపరేషన్ చేసినప్పుడు మూడు నెలల్లో పోతాడన్నారు. ఆరునెలల తరువాత రెండోసారి ఆపరేషన్ చేసినప్పుడు నెలరోజుల్లో పోతాడన్నారు. ఇప్పుడు రెండు నెలలవుతోంది....రాయిలా ఉన్నాడు”. అది జ్యోతి గొంతు.

ఆ తరువాత వాళ్ళేం మాట్లాడుకుంటున్నారో రమణయ్యకు వినిపించలేదు.

*　　　　*　　　　*

ఆ రాత్రి ఎనిమిది గంటలకు రమణయ్యకు భోజనం తీసుకొని అతని గదిలోకెళ్ళిన సురేష్‌కు తండ్రిలో ఎంతలేపినా చలనం కనిపించకపోవడంతో “నాన్నా!” అని అరుస్తూ బిగ్గరగా ఏడ్చాడు. లోపల్నించి సుధీర్, జ్యోతి, రాధపరుగెత్తుకుని వచ్చారు.

*　　　　*　　　　*

బంధువులందరూ వచ్చారు.

కర్మకాండంతా ఘనంగా జరిపించారు.

తిన్నారు, తాగారు. “ఆహాహా! ఏం మనిషండీ! తాను తిన్నాడు!! పదిమందికీ పెట్టాడు. ఆహాహా”! అంటూ రమణయ్యను వేనోళ్ళ పొగిడి ఎక్కడివాళ్ళక్కడకు వెళ్ళిపోయారు.

(ఆంధ్రప్రభ వీక్లీ, 1986)